నేడు పోలింగ్.. సర్వం సిద్ధం

కుత్బుల్లాపూర్/ కూకట్‌పల్లి, మే 12 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఎన్నికల సిబ్బందికి సామగ్రి కేటాయింపులు, ఈవీఎంలు పోలింగ్ కేంద్రాలకు తరలింపు ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. సోమవారం ఎన్నికల నేపథ్యంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ డీఆర్‌సీ (డిస్ట్రిబ్యూషన్ అండ్ రిసెప్షన్) కేంద్రమైన సుచిత్రలోని లయోలా కళాశాలలో నియోజకవర్గ ఏఆర్వో పులి సైదులు ఆధ్వర్యంలో ఈవీఎంలు పంపిణీ చేశారు. డీఆర్‌సీ కేంద్రంలో భద్రపరిచిన ఈవీఎంలు, ఎన్నికల సామగ్రి అధికారులు నియోజకవర్గంలోని 592 (582 సాధారణ, 10 ఆగ్జిలరీ) పోలింగ్ కేంద్రాల వారీగా కేటాయించి బందోబస్తీ మధ్య పోలింగ్ కేంద్రాలకు తరలించారు.

46 రూట్లు.. 46 శిబిరాల ఏర్పాటు

నియోజకవర్గంలోని 592 పోలింగ్ కేంద్రలకుగాను 46 రూట్లుగా విభజించారు. దీనికి గాను డీఆర్‌సీ కేంద్రంలో 46 శిబిరాలను ఏర్పాటు చేసి ఒక్కో శిబిరంలో 9 నుంచి 17 పోలింగ్ కేంద్రాలకు ఈవీఎం, సామగ్రిని అందజేశారు. సామగ్రి అందుకున్న సిబ్బంది సెక్టోరియల్ అధికారుల సమక్షంలో తమకు ఇచ్చిన జాబితా ప్రకారం వస్తువులను పరిశీలించుకున్నారు.



ఎన్నికల సామగ్రిని తరలిస్తున్న పీవోలు, ఏపీవోలు, కార్మికులు



ఎన్నికల సామగ్రి పంపిణీ ప్రక్రియకు హాజరైన ఎన్నికల సిబ్బంది

సిబ్బంది వివరాలు

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఒక ఏఆర్వో, ఒక ఈఆర్వో, ఎనిమిది మంది ఏఈఆర్వోలు, 592 పోలింగ్ కేంద్రాలకు గాను 592 మంది ప్రిసైడింగ్ అధికారులతో (పీవోలు) పాటు మరో 17 శాతం అదనంగా (100 మందిని) కేటాయించి మొత్తం 692 మంది పీవోలను, అలాగే సహాయ ప్రిసైడింగ్ అధికారులు (ఏపీవోలు) 692 మంది, 1,370 మంది ఇతర పోలింగ్ సిబ్బందిని నియమించారు. అంధుల కోసం ప్రత్యేకంగా ప్రతీ పోలింగ్ కేంద్రానికి ఒక బ్రెయిలీ సైనేజ్ (బ్యాలెట్), దివ్యాంగుల కోసం 250 వీల్‌చైర్లు తరలించారు.

● డీఆర్‌సీ కేంద్రంలో ఈవీఎంలు, సామగ్రి పంపిణీ సందర్భంగా అధికారులకు, సిబ్బందికి ఇబ్బంది కలుగకుండా అవసరమైన సమాచారం, ఎన్నికల విధుల్లో తలెత్తే అభ్యంతరాలను నివృత్తి చేసుకునేందుకు ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేశారు.

● ఎన్నికల విధులకు కేటాయించిన పీవోలు, ఏపీవోలు, ఓపీవోలను ఆదివారం ఉదయం 9 గంటలకు హాజరు కావాలని ఆదేశాలు జారీ చేసినప్పటికీ పలువురు 11.30 గంటల వరకు కూడా రిపోర్టింగ్ చేయకపోవడంతో ఏఆర్వో పలుమార్లు హెచ్చరికలు జారీ చేశారు. దీంతో ఎంతకీ వారు హాజరు కాకపోవడంతో అదనపు పీవోలు, ఏపీవోలను తీసుకొని గైర్హాజరు అయిన వారి స్థానంలో విధులు కేటాయించారు. కొంత మంది పీవోలు, ఏపీవోలు మధ్యాహ్నం 12.30 గంటలకు రిపోర్టు చేయడానికి రావడంతో వారిపై ఏఆర్వో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసి అటువంటి వారిని ఎన్నికల విధులకు గైర్హాజరుగానే పరిగణిస్తామని స్పష్టం చేశారు.

● ఈవీఎంల కేటాయింపు ప్రక్రియ పూర్తైన అనంతరం రూట్ల వారీగా పోలింగ్ కేంద్రాల తరలింపు నేపథ్యంలో కొంత గందరగోళ పరిస్థితి నెలకొంది. పరిస్థితిని గమనించిన ఏఆర్వో అక్కడకు చేరుకొని పోలీసులను, ట్రాన్స్‌పోర్టు సిబ్బందిని అప్రమత్తం చేసి పరిస్థితిని చక్కదిద్దారు.

ఓటరు జాబితా

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో మొత్తం 7,24,992 ఓటర్లు ఓటుహక్కు కలిగి ఉన్నారు. వీరిలో పురుషులు 3,78,362 మంది, మహిళలు 3,46,468 మంది, ఇతరులు 162 మంది ఉన్నారు.



ఈవీఎంలతో పార్కులో కూర్చున్న సిబ్బంది



ఎన్నికల సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎన్నికల అధికారి అభిలాష అభినవ్

● కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలో మొత్తం 4,82,056 మంది ఓటర్లు ఉండగా.. వారిలో 2,51,424 మంది పురుషులు, 2,30,506 మంది మహిళలు, 126 మంది ఇతరులున్నారు. ఓటర్ స్లిప్స్ పంపిణీ పూర్తిస్థాయిలో జరగలేదు. పోలింగ్ సిబ్బంది తూతూమంత్రంగా ఓటరు స్లిప్స్ పంపిణీ చేసి చేతులు దులుపుకొన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఎండల తీవ్రత కారణంగా పోలింగ్ సమయంలోనూ స్వల్ప మార్పులు చేశారు. గతంలో ఉదయం 7 నుంచి సాయంత్రం 5 వరకు ఓటు వేసే అవకాశం ఉండేది. ఈసారి ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు అవకాశం కల్పించారు.

కూకట్‌పల్లిలో ఏర్పాట్లు పూర్తి

కూకట్‌పల్లి, మే 12 (ఆంధ్రజ్యోతి): సోమవారం నిర్వహించనున్న పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు అధికారులు పూర్తి చేశారు. మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని కూకట్‌పల్లిలో 418 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఆదివారం సాయంత్రానికి అవసరైన సదుపాయాలు కల్పించారు. కూకట్‌పల్లిలోని జేఎన్‌టీయూలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ద్వారా సిబ్బందికి ఈవీఎంలను పంపిణీ చేసే కార్యక్రమం పూర్తయింది.



ఎన్నికల అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ శశాంక తదితరులు

ఈవీఎంల డిస్ట్రిబ్యూషన్ సెంటర్ పరిశీలన

గచ్చిబౌలి, రాయదుర్గం, మే 12 (ఆంధ్రజ్యోతి): సోమవారం జరుగనున్న చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి ఇండోర్ స్టేడియంలో శేరిలింగంపల్లి నియోజకవర్గ ఎన్నికల సామగ్రి డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రం నుంచి ఈవీఎం ప్యాడ్‌లు, ఇతర సామగ్రిని పోలింగ్ సిబ్బందికి ఆదివారం మధ్యాహ్నం అందజేశారు. గచ్చిబౌలి డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని రంగారెడ్డి జిల్లా ఈఆర్‌ఓ, కలెక్టర్ శశాంక, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ స్నేహశబరీష్, సందర్శించారు. సిబ్బందికి తీసుకోవాల్సిన అంశాలపై పలు సూచనలు చేశారు.

అందరూ ఓటు వేయాలి: సీఐ



విజయవర్ధన్

పేట్‌బషీరాబాద్, మే 12(ఆంధ్రజ్యోతి): ఓటు హక్కు ఉన్న అందరూ విధిగా ఓటు వేయాలని పేట్‌బషీరాబాద్ సీఐ విజయవర్ధన్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సోమవారం జరిగే లోక్‌సభ ఎన్నికల్లో పోలీస్ స్టేషన్ పరిధిలోని 26 పోలింగ్ స్టేషన్లు, 91 పోలింగ్ బూత్‌లు ఉన్నాయని, దేవరాంజల్, గుండ్ల పోచంపల్లి, మైసమ్మగూడ, దూలపల్లి, కొంపల్లి తదితర ప్రాంతాల్లోని పోలింగ్ బూత్‌ల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. డీసీపీ, ఏసీపీ పర్యవేక్షణలో రెండొందల మంది సిబ్బంది పని చేస్తున్నారని, ఇందులో ఇద్దరు ఇన్‌స్పెక్టర్స్, ఏడు మంది ఎస్‌ఐలు విధుల్లో ఉంటారని తెలిపారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఆయా కొన్ని పోలింగ్ కేంద్రాల్లో పోలీసులు గస్తీలో ఉంటారని, పోలింగ్ బూత్ ఏజంట్లు ఎన్నికల నిబంధనలను పాటించాలని ఆయన తెలిపారు.

ప్రతీకార్మికుడు ఓటు హక్కును వినియోగించుకోవాలి

షాపూర్‌నగర్, మే 12(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతీ కార్మికుడు తమ ఓటు హక్కును వినియోగించుకోవాల్సిందిగా శ్రమశక్తి అవార్డు గ్రహీత, రాష్ట్ర కార్మిక నాయకులు ముద్దాపురం మదన్‌గౌడ్ కోరారు. ఓటు మంచి అభ్యర్థికి వేసి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలన్నారు. కంపెనీల యాజమాన్యం కార్మికులను విధులకు రావాలని ఆదేశిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని, ప్రతి కంపెనీ కార్మికులు ఓటు హక్కును వినియోగించుకోవడానికి ఎన్నికల రోజు పూర్తి వేతనంతో కూడిన సెలవు ప్రభుత్వం ప్రకటించిందన్నారు.



మాతృమూర్తులను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కొండా విజయ్

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మాతృ దినోత్సవం

చందానగర్, మే 12 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మాతృ దినోత్సవాన్ని ఆదివారం చందానగర్‌లో నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ హోప్ వ్యవస్థాపకుడు కొండా విజయ్ పలువురు మాతృమూర్తులను ఆదివారం సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు మారం వెంకటేశ్వర్లు గుప్తా, మధుసూదన రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



పుష్పాలంకరణలో వేంకటేశ్వరస్వామి

భెల్‌కాలనీ, మే 12 (ఆంధ్రజ్యోతి): బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లోని వేంకటేశ్వర, యోగేశ్వరస్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమైయ్యాయి. కాలనీలో దేవాలయాన్ని నిర్మించి 55 ఏళ్లు పూర్తైన సందర్భంగా వార్షికోత్సవాలు ఆదివారం ప్రారంభించారు. ఉదయం దేవస్థాన ప్రాంగణంలో గల అన్ని ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలను గజవాహనంపై అలంకరించి దేవాలయ ప్రాంగణంలో ఊరేగించారు. దేవస్థాన ప్రధానార్చకులు రామకృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో ప్రారంభమైన బ్రహ్మోత్సవాల్లో కాలనీవాసులు, కార్యవర్గసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత



వాహనంతో పాటు సీజ్ చేసిన మద్యం

అల్లాపూర్, మే 12 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 622.08 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఓ పార్టీకి చెందిన ముగ్గురు పర్వత్‌నగర్ ప్రాంతంలో ఓ వైన్ షాపులో మద్యం కొనుగోలు చేసి కూకట్‌పల్లి తరలిస్తున్నారు. కైతలాపూర్ బ్రిడ్జి వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు వాహనాన్ని తనిఖీ చేయగా కార్టన్లలో మద్యం సీసాలు ఉన్నాయి. ఆటోను, మద్యంను స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్ వినయ్, అనిల్, సైదులుపై కేసు నమోదు చేశారు.

గుడిసెల్లో అక్రమంగా మద్యం విక్రయం

● ముగ్గురికి రిమాండ్



స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

చంపాపేట, మే 12 (ఆంధ్రజ్యోతి): మిధానీ డిపో సమీపంలో గుడిసెల్లో అక్రమంగా మద్య విక్రయిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గుడిసెల్లో కిరాణాషాప్ నిర్వహిస్తున్న జ్యోతి(38) విక్రయానికి నిల్వ ఉంచిన రూ.80,190 విలువైన 72.90 లీటర్ల మద్యం, మరో మహిళ కేతావత్ జ్యోతి(35), నేనావత్ తిరుపతి(30) ఇంటి నుంచి రూ.3,412 విలువైన 13.65 లీటర్ల మద్యంను స్వాధీనం చేసుకున్నామని, వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, మే 12 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ డేవిడ్ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. సీతాఫల్‌మండి - మల్కాజిగిరి రైల్వే స్టేషన్‌ల మధ్య ఆదివారం సాయంత్రం 4.30 గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తిని(75) రైలు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన వ్యక్తిని గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అదేరోజు సాయంత్రం 5.50 గంటలకు చనిపోయాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

● శంకర జయంతి



కేపీహెచ్‌బీ నాలుగోఫేజ్‌లోని సిద్ధి వినాయక భ్రమరాంబిక మల్లికార్జునస్వామి ఆలయంలో ఆదివారం శంకర జయంతి వేడుకలను నిర్వహించారు. ప్రవచనాలు అనంతరం అన్నసమారాధన చేశారు. కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు, డా.రామ్‌సింగ్, కోదండరామయ్య పాల్గొన్నారు. - కేపీహెచ్‌బీకాలనీ, ఆంధ్రజ్యోతి

అవే సమస్యలు.. అదే నిర్లక్ష్యం

వృద్ధులు, దివ్యాంగులకు ఇబ్బందులు

భెల్‌కాలనీ, మే 12 (ఆంధ్రజ్యోతి): గత అసెంబ్లీ ఎన్నికల్లో వృద్ధులు.. దివ్యాంగులు ఎదుర్కొన్న ఇబ్బందులను పరిష్కరిస్తామన్న అధికారుల మాటలు ప్రకటనలకే పరిమితమయ్యాయి. గత ఎన్నికల్లో తలెత్తిన లోపాలను సరిదిద్దుతామన్న ఎన్నికల పరిశీలకులు, అధికారులు ఆపై పోలింగ్ కేంద్రాల వైపు కన్నెత్తి చూడకపోవడంతో మరోమారు వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బంది పడే పరిస్థితి నెలకొంది. శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని భెల్ ఎంఐజీకాలనీలో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్‌లో అరకొర సదుపాయాలు ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు. ముఖ్యంగా కాలనీలోని ప్రధాన కేంద్రమైన శ్రీవాణి విద్యానికేతన్ పాఠశాలలో 8 బూత్‌లు, అత్యధిక ఓట్లు ఉన్నారు. అయితే ఈ పోలింగ్ కేంద్రంలో ఎత్తైన మెట్లు ఉండడంతో గతంలో వృద్ధులు, దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వృద్ధుల కోసం ఓ ర్యాంప్ నిర్మించినప్పటికీ అది సక్రమంగా లేకపోవడంతో ట్రై సైకిల్స్ పైకి వెళ్లడం కష్టంగా మారింది. వాటిని సరిచేస్తామన్న అధికారులు ఆ విషయమే మరిచిపోయారు. దీంతో మళ్లీ అదే సమస్య ఎదురవుతోంది. గత ఎన్నికల్లో తాగునీటి సమస్య ఏర్పడింది.



మెట్లు దిగలేక ఇబ్బందులు పడుతున్న వృద్ధురాలు (ఫైల్)



ఎత్తైన ర్యాంప్

బీజేపీ నుంచి దేశాన్ని విముక్తి చేద్దాం: సీపీఎం

షాపూర్‌నగర్, మే 12(ఆంధ్రజ్యోతి): బీజేపీ బందీఖానా నుంచి దేశాన్ని విముక్తి చేద్దాం, మనువాద పెత్తనాన్ని మట్టి కరిపిద్దాం, ఓటుతో ఓడిద్దాం అని సీపీఎం మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ అన్నారు. ఆదివారం షాపూర్‌నగర్‌లో పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికలు దేశ భవిష్యత్‌ను నిర్ణయించబోతున్నాయని, పదేళ్ల బీజేపీ అధికారంలో దేశం ఒక్క అడుగు ముందుకు కదిలిందా అని ప్రశ్నించారు. పెద్దనోట్లు రద్దు, ఉగ్రవాదం నిర్మూలన, జీఎస్‌టీతో పేదల బతుకులు ఆగమయ్యాయని తెలిపారు. పత్రికా రంగాన్ని వాటి యాజమాన్యాన్ని నయానో భయానో వారి చేతుల్లోకి తీసుకొనే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీ హటావో దేశ్ బచావో నినాదాన్ని దేశంలో అమలు పరచాలని కోరారు.

అలరించిన భరతనాట్య ప్రదర్శన

బంజారాహిల్స్, మే 12 (ఆంధ్రజ్యోతి): మాదాపూర్ శిల్పారామంలో ఆదివారం కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలు అలరించాయి. చెన్నై నుంచి విచ్చేసిన భరతనాట్య కళాకారిణి రక్షా దేవనాధన్ నట్టైకు రంజి రాగం వర్ణం, జయదేవ అష్టపది అంశాలను ప్రదర్శించి మెప్పించారు. కూచిపూడి నటి గురువర్యులు చూడామణి తన శిష్య బృందంచే మూషిక వాహన, పలుకే బంగారమాయే, అలరింపు, పుష్పాంజలి, నటేశకౌతం, జతిస్వరం, బ్రహ్మాంజలి, జయజనార్దన, ఆనంద తాండవం, మాతృ దినోత్సవం సందర్భంగా "అమ్మ" నృత్య రూపకాన్ని ప్రదర్శించారు. దీక్ష, అద్వితి, శ్లోక, నయోనికా, లాస్య, లక్ష, సమన్విత, హెత్విక అద్భుతంగా నృత్య ప్రదర్శన చేశారు.



చిన్నారుల నాట్య ప్రదర్శన

మాయమాటలు చెప్పి బాలికపై లైంగిక దాడి

● గర్భవతి అని తేలడంతో యువకుడిపై కేసు

అమీర్‌పేట, మే 12(ఆంధ్రజ్యోతి): మాయమాటలు చెప్పి బాలికపై పలుమార్లు లైంగికదాడికి పాల్పడ్డాడు ఓ వ్యక్తి. కడుపునొప్పితో బాధపడుతున్న బాలికను తల్లిదండ్రులు ఆస్పత్రికి తీసుకెళ్లి పరీక్షలు చేయించగా గర్భవతి అని తేలింది. ఈ ఘటన ఎస్‌ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఓ బాలిక వేరే రాష్ట్రంలో బాలికల వసతి గృహంలో ఉంటూ తొమ్మిదో తరగతి చదువుతోంది. సెలవులు ఉన్నప్పుడల్లా నగరంలో ఉంటున్న తల్లిదండ్రుల వద్దకు వస్తుంటుంది. వారి పక్కింట్లో ఉంటున్న యువకుడి కన్ను ఆమెపై పడింది. బాలిక తరచూ పక్కింటికి వెళ్లి వారి బాబును ఎత్తుకునేది. ఇదే అదునుగా భావించిన యువకుడు బాలికకు మాయమాటలు చెప్పి లోబర్చుకున్నాడు. పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. కడుపునొప్పిగా ఉందని బాలిక తల్లిదండ్రులకు చెప్పగా.. ఆస్పత్రికి తీసుకెళ్లి పరీక్షలు చేయించగా గర్భవతి అని తేలింది. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు యువకుడిపై కేసు నమోదు చేశారు.

పట్టపగలు చొరబడి వృద్ధురాలి గొలుసు చోరీ

పంజాగుట్ట, మే 12 (ఆంధ్రజ్యోతి): పట్టపగలు ఓ ఆగంతుకుడు ఇంట్లోకి చొరబడ్డాడు. వంటగదిలో ఉన్న వృద్ధురాలిని బెదిరించి ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసు లాక్కుని పారిపోయాడు. ఈ ఘటన పంజాగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిగూడ శాలివాహననగర్ కాలనీలో ఓ ఇంట్లో విజయలక్ష్మి(75) నివసిస్తోంది. ఆదివారం వంటగదిలో వంట చేస్తుండగా పక్క ఇంట్లో నుంచి ఓ ఆగంతుకుడు గోడ దూకి ఆమె ఇంట్లోకి వచ్చాడు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో వంటగదిలో ఒంటరిగా ఉన్న విజయలక్ష్మిని బెదిరించాడు. ఆమె కేకలు వేయకుండా నోరు మూసేశాడు. వృద్ధురాలి మెడలో ఉన్న నాలుగు తులాల బంగారు గొలుసు లాక్కొని పారిపోయాడు. బాధితురాలు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చింది. వారు ఇంటికి చేరుకొని పోలీసులకు సమాచారం అందించారు. పంజాగుట్ట ఏసీపీ ఎస్. మోహన్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ శోభన్, డీఐ క్రాంతి కుమార్ ఘటనా స్థలాన్ని సందర్శించారు. బాధితురాలిని అడిగి వివరాలు తెలుసుకుని ఆధారాలు సేకరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సీసీ కెమెరా ఫుటేజీ పరిశీలించారు. ఆగంతుకుడు ఓ హాస్టల్‌లోకి వెళ్లడంతో, అతడి ఫోన్ నంబర్, చిరునామా సేకరించారు. సాంకేతిక ఆధారాలతో అతడిని అదుపులోకి తీసుకొని బంగారు గొలుసు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది.

పుస్తకాల ఖని కోఠి

తక్కువ ధరకే పాత, కొత్తవి అందుబాటులో..



ఆబిడ్స్ జీపీవో వద్ద పుస్తకాలు

- జీ మ్యాట్ నుంచి ఎంసెట్, పీజీ సెట్ ఎంట్రెన్స్ బుక్స్ వరకూ...
- 40 నుంచి 60 శాతం డిస్కౌంట్‌తో...
- కోఠిలోని సబ్‌వే, సుల్తాన్ బజార్, బ్యాంక్ స్ట్రీట్, ఆబిడ్స్, ప్రధాన రోడ్లపై..

విద్య, ఉద్యోగాలు, పోటీ పరీక్షల కోసం కోటి ఆశలతో నగరానికి వచ్చే యువతకు ఆ ప్రాంతం దిక్సూచీ. అక్కడ ప్రతి పుస్తకం తక్కువ ధరకే అందుబాటులో ఉంటుంది. ఇక్కడ ఫుట్‌పాత్‌లు, రోడ్డుకు ఇరువైపులా వందల సంఖ్యలో షాపులు ఉన్నాయి. వాటిల్లో పాత పుస్తకాలతోపాటు కొత్త పుస్తకాలు లభిస్తాయి. అందుకే వారికి 'కోఠి' విజ్ఞాన ఖనిలా మారింది.

మంగళ్‌హాట్, మే 12 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఆశలతో నగరానికి వచ్చి కోచింగ్ సెంటర్లలో శిక్షణ తీసుకుంటున్న పలువురు ఉద్యోగార్థులు కోఠికి వచ్చి వారికి నచ్చిన పుస్తకాలను కొనుగోలు చేస్తున్నారు. ఇక్కడ ఇంజనీరింగ్, మెడిసిన్, టీఎస్‌పీఎస్సీ యూపీఎస్సీ, సివిల్స్ పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు 40 నుంచి 60 శాతం డిస్కౌంట్‌తో షాపులలో విక్రయిస్తుంటారు. దాంతో సెలవు రోజులు, ఆదివారం వచ్చిందంటే చాలు కోఠి ప్రధాన రహదారుల్లోని ఫుట్‌పాత్‌లు, బడ్డీ కొట్ల వద్ద పుస్తకాల కోసం విద్యావంతులు, విద్యార్థులు బారులు తీరుతున్నారు.


ఆదివారం, సెలవు రోజుల్లో..

రాష్ట్రంలోని వివిధ జిల్లాలు, మారు మూల పల్లెల నుంచి నగరానికి వచ్చి హాస్టల్‌లో ఉంటూ పోటీ పరీక్షలకు ప్రిపేరవుతున్న పలువురు విద్యార్థులు కోఠిలోని సబ్‌వే, సుల్తాన్ బజార్ రోడ్, ఆబిడ్స్ జీపీఓ ప్రధాన రహదారి, బ్యాంక్‌స్ట్రీట్ తదితర ప్రాంతాల్లో ఉన్న షాపులకు వారికి అవసరమైనవి కొనుక్కుని వెళ్తున్నారు. ఇక్కడి షాపుల నిర్వాహకులు కొత్త పుస్తకాలను నేరుగా ప్రింటర్స్, పబ్లిషర్స్ నుంచి తీసుకురావడం వల్ల డిస్కౌంట్ కూడా అధికంగానే ఇస్తుంటారు. మరి కొంతమంది వ్యాపారులు కొద్ది రోజులపాటు పుస్తకాలను విద్యార్థులకు అద్దె (రెంట్)కు ఇస్తుంటారు. అందుకు వారు పూర్తి వివరాలతో పాటు కొంత మొత్తం నగదు డిపాజిట్ చేయాల్సి ఉంటుంది.

ప్రతి పుస్తకం అందుబాటులో...


జీ మ్యాట్, క్యాట్, సాట్, ఎంసెట్, పీజీ సెట్, లాసెట్, జేఈఈ మెయిన్, జేఈఈ అడ్వాన్స్, ఎన్‌ఐఎఫ్‌టీ, నీట్, ఇంజనీరింగ్, ఏఐఐఎంఎస్, ఏఐఈఈడీ లాంటి పోటీ పరీక్షల పుస్తకాలతోపాటు ఐదారేళ్ల కిందటి ప్రశ్నపత్రాలు కూడా అందుబాటులో ఉంటాయి. ఐఐటీ, ఎంబీఏ, ఎంసీఏ, బీటెక్, ఎంటెక్, బీఎస్సీ, ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ, ఫార్మసీ, డిగ్రీ, మెడిసిన్, మెకానికల్, ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్, సివిల్ ఇంజనీరింగ్‌తో పాటు పీహెచ్‌డీ పుస్తకాలు సైతం తక్కువ ధరలో దొరుకుతుంటాయి. ప్రముఖ కవులు రచించిన నవలలు, సాహిత్య పుస్తకాలు, గ్రంథాలు, కవితా సంపుటాలు, ఇలా అన్ని రకాల పుస్తకాలుకు కోఠి పెట్టింది పేరు.

సీజన్‌లో కాస్త లాభం ఉంటుంది



కోఠి ప్రధాన రహదారి ఫుట్‌పాత్ పై పుస్తకాల దుకాణాలకు అనుమతి ఉన్న సమయంలో మంచి వ్యాపారం సాగేది. సబ్‌వేకు మార్చిన తరువాత తగ్గింది. సీజన్‌లో మాత్రం రద్దీ అధికంగా ఉంటుంది. విద్యార్థులతో పాటు ప్రముఖులు వస్తుంటారు. ప్రముఖ రచయితల పుస్తకాల కోసం వచ్చిన సమయంలో పబ్లిషర్స్ నుంచి తెప్పించి ఇచ్చేందుకు ప్రయత్నిస్తుంటాం.

- అబ్దుల్ (పుస్తకాల వ్యాపారి)



కోఠి ప్రధాన రహదారిలో పుస్తకాల అమ్మకాలు

విజ్ఞానానికి పెద్దపీట

విద్యా సంవత్సరం ఆరంభంలో జూన్, జులై, ఆగస్టు నెలల్లో విద్యార్థులు పుస్తకాలు తీసుకునేందుకు ఎక్కువగా కోఠికి వస్తుంటారు. వార్షిక, సప్లిమెంటరీ పరీక్షల సమయంలో విద్యార్థులు పుస్తకాలు, పాత ప్రశ్నపత్రాలు కొనుగోలు చేస్తుంటారు. సాధారణ రోజులలో విద్యావంతులు, సాహితీ ప్రియులు విజ్ఞానాన్ని పెంచుకోవడానికి, మరికొంతమంది జనరల్ నాలెడ్జ్, ఇంగ్లిష్, సైన్స్‌కు సంబంధించిన పుస్తకాలు కొనుగులు చేస్తుంటారని వ్యాపారులు చెబుతున్నారు. అలాంటి వారి కోసం ప్రత్యేకంగా పబ్లిషర్స్ నుంచి తెప్పించి ఇస్తుంటామని, అందుకు ఎక్కువ ధర చెల్లించాల్సి ఉంటుందన్నారు.

పాత పుస్తకాలు తిరిగి ఇక్కడికే..

పుస్తకాలు కొన్న తరువాత తమ అవసరం తీరిన వారు తిరిగి అవి ఇతరులకు ఉపయోగపడాలనే ఉద్దేశంతో మళ్లీ ఇక్కడి షాపుల వారికే అమ్మేస్తుంటారు. ముఖ్యంగా విద్యార్థులు తమ విద్యా సంవత్సరం పూర్తై వెళ్లిపోయే సమయంలో వాటిని ఎంతో కొంతకు వ్యాపారులకు ఇచ్చేస్తుంటారు.

మెండుగా ఆదాయం

పాత పుస్తకాల దుకాణదారులకు ఆదాయం మెండుగా ఉంటుంది. రోజు వేలల్లో వ్యాపారం సాగుతుందని, ముఖ్యంగా సెలవుదినమైన ఆదివారం రూ.10 వేల నుంచి 20 వేల వరకు వ్యాపారం జరుగుతుందని ఓ వ్యాపారి తెలిపారు.